ఓంశ్రీసాయిరాం

భగవాన్‌శ్రీశ్రీశ్రీసత్యసాయిబాబావారి 80వ జన్మదిన సందేశము.

సత్యధర్మప్రేమశాంతులు లేకున్న
విద్యలన్నియు నేర్చి విలువ సున్న
సత్యధర్మప్రేమశాంతులు లేకున్న
దానధర్మాల సార్థకత సున్న
సత్యధర్మప్రేమశాంతులు లేకున్న
పదవులేలిన ఫలము సున్న
సత్యధర్మప్రేమశాంతులు లేకున్న
బహుళ సత్కార్య లాభంబు సున్న
ఈ సనాతన ధర్మ హర్మ్యంబు నిలువ
గుణములియ్యవి నాలుగు గోడలప్ప
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

ప్రేమస్వరూపులారా!

మానవుడు శాంతిని అనుభవించేనిమిత్తమై జన్మించాడుగాని, పదవులనేలే నిమిత్తం కాదు. ఎన్ని ఉండినప్పటికీ మానవునికి శాంతి లేకుండిన జీవితమే శూన్యము. ఈ జగత్తులో అనేకమంది శ్రీమంతులున్నారు. కోట్లకొలది విద్యావంతులున్నారు, గొప్పగొప్ప పదవులనేలినవారున్నారు. కాని, వీరందరివల్ల సమాజానికి కలుగుతున్న ఉపకారమేమిటి? బీదల కష్టాలను తీర్చటానికి వారికి సమయము లేదు. అసలు బీదల పరిస్థితి ఏమిటనే విషయాన్ని ఆలోచించేవారే లేరు. అందరూ 'షో వర్క్' చేస్తున్నారేగాని, 'సోషల్ వర్క్' చేయటం లేదు. 'భవతీ భిక్షాం దేహి' అంటూ ఇంటి ముందుకు వచ్చిన వారిని పట్టెడన్నం కూడా పెట్టకుండా 'వెళ్లిపో' అని కసురుకుంటున్నారు.

అసలు 'మానవ' అనే పదము యొక్క అర్థమును ఎవ్వరూ గుర్తించటం లేదు. మనిషికి యేది ముఖ్యము? కోరికలు తీర్చుకోటమే ముఖ్యమా? ప్రపంచికంగా అభివృద్ధికి రావటం ముఖ్యమా? లౌకికమైన ఆనందమును అనుభవించటం ముఖ్యమా? ఇవేవీ ముఖ్యం కావు. మానవ జీవితంలో సుఖదుఃఖములు రెండూ కలసి ఉంటాయి. కేవలం సుఖమును మాత్రమే అనుభవించాలంటే వీలుకాదు. తోటి మానవునికి తోడ్పడలేని వానికి మనశ్శాంతి ఎలా లభిస్తుంది? సాటి మానవునికి మనం సహాయం చేయాలి. ప్రతి మానవునికి కష్టసుఖాలు రెండూ ఉంటాయి. అయితే, అవి కదలిపోయే మేఘాలవలె వస్తాయి, పోతాయి. మనము కష్టసుఖములు రెండింటిని సమముగా భావించాలి. దుఃఖములో ఆనందమున్నది. ఆనందములో దుఃఖమున్నది. సుఖదుఃఖములు మానవునికి తప్పునవి కావు. అయితే, జీవితంలో అభివృద్ధిని సాధించాలంటే ఈ రెండింటిని సమానంగా చూసుకోవాలి. సమానత్వము లేనివాడు మానవుడనిపించుకోడు. సమానత్వము లేనివాడు సమాజములో ఉండ తగడు. 'సుఖదుఖే సమేకృత్వా లాభా లాభౌ జయా జయౌ' అన్నట్లు, సుఖదుఃఖములపట్ల

సమదృష్టిని కలిగి ఉండాలి. కాని, ఈనాటి మానవుడు ఎన్ని లుఖములు పొందినప్పటికీ ఒక్క కష్టము వచ్చిందంటే తట్టుకోలేకపోతున్నాడు. ఒక శ్రీమంతుని దగ్గరకు వెళ్ళి, 'అయ్యా! మీరు ఆనందంగా ఉన్నారా?' అని ప్రశ్నించండి. అతనేమి సమాధానం చెబుతాడు? ' అయ్యా! నావద్ద కావలసినంత ధనముంది. నా కుమారులు గొప్ప పదవులలో ఉన్నారు. నా యింట్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విలువైన వస్తువులున్నాయి. అన్నీ ఉన్నాయిగాని, నాకు మనశ్శాంతి లేదు' అంటాడు. శాంతి లేకపోవటానికి కారణం ఏమిటి? దోషమెక్కడున్నది? మానవుడు , 'అయ్యా! నీవెవరు? నీవెవరు?' అని ఎదుటి వ్యక్తిని ప్రశ్నిస్తున్నాడేగాని, 'నేనెవరు?' అని తనను తాను ప్రశ్నించుకోటం లేదు. 'నేనెవరు? ' అనే ప్రశ్నకు జవాబు తెలుసుకుంటే తన కష్టములన్నీ తీరిపోతాయి. కాబట్టి, మొట్టమొదట తనను తాను తెలుసుకోటానికి ప్రయత్నం చేయాలి. తనను తాను తెలుసుకొనక ఎన్ని తెలుసుకున్నా ప్రయోజనం లేదు.

వానలు వచ్చెనంచు భువి పండునె విత్తులు నాటకున్న? వానలు రానిచో భువి పండునె విత్తులు నాటియున్న? వానలు రావాలి, విత్తనములూ నాటాలి. నెగిటివ్, పోజిటివ్ రెండూ చేరినప్పుడే కరెంటు ప్రవహిస్తుంది. అట్లే, పురుషప్రయత్నానికి దైవానుగ్రహము తోడైనప్పుడే ఫలసిద్ధి కల్గుతుంది. 'ఈశ్వరస్సర్వ భూతానాం', 'ఈశావాస్య మిదం సర్వం'. అట్టి దైవత్వమును విస్మరించి భౌతిక సుఖములకోసం ప్రాకులాడటం వెఱ్ఱితనం. మనం భౌతిక సుఖములను అనుభవించటానికి పుట్టలేగని తెలుసుకోవాలి. ఆధ్యాత్మికములో ప్రవేశించాలి. ఆధ్యాత్మిక దృక్పథము లేనివానికి తాను మనిషినని చెప్పుకోటానికి అధికారమే లేదు. ఆధ్యాత్మికతను విస్మరిస్తే దైవానికే ద్రోహము చేసినట్లవుతుంది. భగవంతుడు అందరూ తనను పూజించాలని ఆశించడు. ఈ జగత్తుకు మీరు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించాలని ఆకాంక్షిస్తాడు. మనం మానవులుగా జన్మించినందుకు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలి. సత్కర్మలనాచరించాలి.

ఒకానొక సమయంలో నారదుడు విష్ణువును ప్రశ్నించాడు. 'స్వామీ! జన్మరాహిత్యము పొందే మార్గమేమిటి?' అని. అప్పుడు విష్ణువు, 'నారదా! నేను అందరియందున్నానే సత్యాన్ని గ్రహించాలి' అన్నాడు. మానవుడు దైవస్వరూపుడేగాని, కేవలం దేహస్వరూపుడు కాదు. జీవత్వమనే నెగిటివ్ఉండటంచేత దైవత్వమనే పోజిటివ్ వచ్చి చేరుతుంది. భగవంతుడు లోకములోని ప్రజలందరితో కలసి మెలగుతూ లోకసంరక్షణ గావించాలంటే తాను మానవ రూపాన్నే ధరించాలి. విష్ణువు చెప్పాడు, ' నారదా! నాయొక్క అంశమే అందరియందుఆత్మగా వెలుగొందుతున్నాది. ఎక్కడైతే ఆత్మచింతన చేస్తారో అక్కడ నేను తప్పక నిలుస్తాను'.

ప్రేమస్వరూపులారా! మీయందున్న ఆత్మయే అందరియందున్నదనే సత్యాన్ని గుర్తించండి. అప్పుడు దైవత్వము మీ యింటనే, వెంటనే, జంటనే ఉంటుంది. జీవితమంతా మీరు నెగిటివ్ భావాలతో గడుపుతుంటే మీకు దివ్యత్వమనే పోజిటివ్ ఏనాటికీ లభించదు. దేవుడు సర్వత్రా ఉన్నాడు కాబట్టి, మీరు దేవునికోసం దేవులాడవలసిన పని లేదు. 'నాయందు కూడా భగవంతుడున్నాడు' అని విశ్వసించండి. దేవుడంటే ఒక ప్రత్యేకమైన స్వరూపము గలవాడుకాదు. మీరందరూ ఆత్మస్వరూపులేగాని, దేహస్వరూపులు కాదు.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహినిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్
మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబుజాడ యా
దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

ఎవరైనా 'నా ఆత్మతత్త్వము మరణించింది' అని చెప్పగలరా! దేహము కూలినప్పటికి ఆత్మతత్త్వము శాశ్వతంగా ఉంటుంది. పాత్రలో నీరున్నవంతవరకే ప్రతిబింబము కనిపిస్తుంది. నీరు పారపోస్తే ప్రతిబింబమనేది కనిపించదు. ఒక చిన్న ఉదాహరణము. మన యింటిలో బావి ఉన్నది. ఇంటిపైన వాటర్ ట్యాంకు ఉన్నది. పెద్ద చెఱువు ఒకటున్నది. నదులు ప్రవహిస్తున్నాయి. సముద్రముకూడా ఉన్నది. వీటన్నిటియందు సూర్యుడు ప్రతిబింబముగా కనిపిస్తున్నాడు. ప్రతి మానవుడు ఒక ప్రవాహము వంటివాడు. ఈ ప్రవాహములో ఆత్మ అనే సూర్యుడు కనిపిస్తుంటాడు. ఒకే సూర్యుడు సమస్త లోకములకు ఒక్కొక్కడై కనిపిస్తుంటాడు. అమెరికావారికి పగలైనప్పుడు మనకు రాత్రి అవుతుంది. వారికి రాత్రి అయినప్పుడు మనకు పగలు అవుతుంది. అంతేగాని, ఇండియన్ సూర్యుడు, అమెరికన్ సూర్యుడు అనే భేదము లేదు కదా! కాలములో వ్యత్యాసమున్నాదిగాని, సూర్యుడు ఒక్కడే. అదేరీతిగా, ఒకే దైవత్వము అందరియందు గోచరిస్తున్నది. భగవంతుడు ఒక్కడే. సత్యమొక్కటే. ప్రేమలో జీవించండి. మీరు సత్యప్రేమలతో జీవిస్తే అన్నింటియందు దైవత్వమును దర్శించగలరు. దైవము ఒక్కడే. ఎవరా దైవము? నీవే. ఎవరికివారు 'నేనే దైవము' అనుకోవాలి. 'నేను దైవాన్ని, ఎదుటివాడు కూడా దైవమే' అనే సమత్వాన్ని విశ్వసించాలి. దీనివలన అహంకారము, ద్వేషము మొదలైన దుర్గుణాలు దూరమైపోతాయి. నీవు ఎవరితోనో జగడము వేసుకునానననుకుంటున్నావు. కాని, నిజానికి నీతోనీవే జగడము వేసుకుంటున్నావు. జీవితంలో గెలుపు, ఓటములు మానవునికి సహజం. కనుక, ఓడిడిపోయినవానిని చిన్నచూపుచూడవద్దు. 'నేనే ఓడిపోయాన'నుకో. ఈరీతిగా నీతో పోల్చుకోకుండా ' అతను పరాయివాడు. అతను వేరు, నేను వేరు' అని అనుకుంటే అక్కడే భేదము ప్రారంభమవుతుంది.

నీవెవరు? 'దేహమే నేను' అంటారు కొంతమంది. కాని, దేహము ఎంతవరకు? నీటిబుడగవలె ఎప్పుడు పోతుందో ఏమో! ఇటువంటి క్షణభంగురమైన దేహము నీవని భావించవద్దు. మనస్సే నేను అంటారు కొంతమంది. అసలు మనసంటే ఏమిటి? దానికొక రూపము లేదు. అది కేవలం ఒక కోరిలమూట. మన కోరికలే మనస్సుగా రూపొందుతున్నాయి. ఇవన్నీ ఎప్పుడో ఒకప్పుడు దూరమయ్యేవే. ఈనాటి మానవుని మనస్సు క్షణమైనా స్థిరంగా ఉండదు. కనుకనే, దానిని 'మంకీమైండు' అన్నారు. అయితే, నీవు మానవజాతికి చెందినవాడవు. 'నేను మానవుడను నా మనస్సు మంకీమైండు కాకూడదు' అని నీవు గుర్తుంచుకోవాలి.

'దైవం మానుషరూపేణ'. దైవము మనుష్య రూపములో ఉన్నాడు. కాబట్టి, దేహాభిమానమును దూరం పెట్టి 'నేను దేవుడను' అని విశ్వసించు. రాతిబొమ్మను మందిరంలో ప్రతిష్ఠించి దానికి పూజాపునస్కారాలు చేస్తున్నావు. ఆ విగ్రహము ఎక్కడిది? నీవు రూపొందించినదే! నీవు చేసిన విగ్రహానికి పూజలు చేస్తున్నావుగాని, నిన్ను నీవు పూజించుకోటంలేదే! మనిషి రూపంలో ప్రత్యక్షంగా ఉన్న దైవాన్ని పూజించకుండా ఏదో విగ్రహాలను పూజిస్తే వచ్చే ఫలిము ఏమిటి? ఏమీ లేదు. ప్రతి మనిషియందున్న ఆత్మతత్త్వాన్ని గౌరవించాలి. ఆత్మవిశ్వాసమే నిజమైన విశ్వాసము. విగ్రహాలపై ఉండే విశ్వాసము తాత్కాలికమైనది. తిరుపతికి పోయినప్పుడు దైవాన్ని వేంకటేశ్వరస్వామి రూపంలో పూజిస్తారు. 'వేంకటేశ్వరస్వామి నా కులదైవము' అని కీర్తిస్తారు. బృందావనం వెళ్ళినప్పుడు కృష్ణుని పేరుతో భగవంతుని పూజిస్తుంటారు. 'కృష్ణుడు మా దైవం' అంటారు. మరి అయోధ్యకు వెళ్ళినప్పుడు 'రాముడు మా దైవం' అంటారు. దేశ, కాల పరిస్థితులను బట్టి అక్కడ ఆయా పేర్లు పుట్టినాయిగాని, భగవంతునికి భేదములు యేయేమాత్రము లేవు. ఏ పేరుతో పిలచినా పలుకుతాడు. రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వరుడు, సాయిబాబా అంతా ఒక్కటే. రూపములో ఉన్న వ్యత్యాసములను చూసి భ్రమించకూడదు.

రూపము శాశ్వతము కాదు. కనుక, శాశ్వతమైన ఆత్మతత్త్వాన్ని విశ్వసించాలి.

ప్రేమస్వరూపులారా! ఎంతయో ఖర్చుపెట్టి, అనేక కష్టములకోర్చి మీరిక్కడకు వస్తుంటారు. ఇన్ని కష్టనష్టములకు గురియై వచ్చిన తరువాత స్వామి బోధనలను మీరు ఆచరణలో పెట్టకపోతే ప్రయోజనమేమిటి? దైవమును ఏకత్వంగా తీసుకోవాలి. అప్పుడే మనకు శాంతి కలుగుతుంది. ఏకత్వము కుదరనంతవరకు మనకు చంచలత్వము తప్పదు. మతములు వేరైనా గమ్యం ఒక్కటే. ఈనాడు ఒక వ్యక్తిని చెడ్డవాడని మీరు విమర్శించవచ్చు. రేపటి దినము అదే వ్యక్తిని మంచివాడని కొనియాడవచ్చును. మంచి, చెడ్డలు మనుష్యులు కల్పించుకున్నవే. మానవుడు సహజంగా మంచివాడే. మానవ జీవితం చాలా పవిత్రమైనది. కనుకనే, 'దైవం మానుషరూపేణా' అన్నారు. ఏ దేవుని చూసినా మనిషి రూపములోనే కనిపిస్తాడు. అయితే, మనం రూపాన్ని ఆధారం చేసుకోకూడదు. అందులో ఉన్న మహత్తరమైన శక్తిని గుర్తించాలి. మన మనస్సును నిశ్చలంగా పెట్టుకోవాలి. నీవు మనిషిగా పుట్టావు. కాబట్టి, నీకు మనిషి మైండు ఉండాలిగాని, మంకీమైండు కాదు. మనిషిగా పుట్టి పశువువలె ప్రవర్తిస్తే ప్రయోజనమేమిటి? నీవు అన్నింటిని త్యజించి సన్యాసి కానక్కరలేదు. మానవ రూపంలో ఉన్న దైవాన్ని దర్శించు. దైవము ఎల్లెడెలా ఉన్నాడని విశ్వసించు. దైవము ఒకచోట ఉండి మరొకచోట లేకపోవటమనేది లేదు.

సర్వతఃపాణిపాదం తత్సర్వతోక్షిశిరోముఖం
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి

మనం వడ్లను పండిస్తున్నాము. కాని, వాటిని వడ్లుగానే భుజించము. పైపొట్టు తీసివేసి బియ్యంగా మార్చుకుంటాము. పొట్టుతో ఉన్నప్పుడు పునర్జన్మ వస్తుంది. పొట్టు తీసివేస్తే పునర్జన్మ లేదు. మన కోరికలే పొట్టు వంటివి. కాబట్టి, కోరికలను త్యజించినప్పుడే మనము జనన, మరణ చక్రము నుండి విముక్తి పొందగలము. బియ్యమును బియ్యముగా ఎవ్వరూ తినరు. బియ్యంతో మనము పులిహోర చేస్తాము, చిత్రాన్నం చేస్తాము, పాయసం చేస్తాము, బియ్యపు పిండితో దోశలు చేస్తాము, యిడ్లీలు చేస్తాము. ఈవిధంగా చూస్తే, ఆహార పదార్థమును బట్టి పేర్లు మారుతున్నాయేగాని, అన్నింటిలో ఉన్నది బియ్యమే. బియ్యము ఒక్కటే అయినప్పటికీ పాకములు వేరు. పొట్టును తీసివేసి వడ్లను బియ్యముగా మార్చుకొని, దానితో అనేకవిధములైన పాకములు చేసుకొని భుజిస్తున్నాము. అదే సంస్కారము. అదేరీతిగా, మన మనస్సునుకూడా సంస్కరించుకొని పవిత్రంగా మార్చుకోవాలి. ప్రతి ఒక్కదానికి సంస్కారం అవసరము. సంస్కరమనగా మంచి మార్పు. ప్రాపంచక దృష్టి అభివృద్ధి పరచుకోటం చేతనే మానవుడు మోసపోతున్నాడు. కాబట్టి, మానవుడు మొట్టమొదట తన దృష్టిని మార్చుకోవాలి. అది తాను మార్చుకొనవలసినదేగాని, భగవంతుడు మారేచది కాదు. భగవంతుడు తన సృష్టిలో అన్నింటినీ పవిత్రంగా, స్వచ్ఛంగా పెడుతున్నాడు. కాని, వాటిని మానవుడే బుద్ధిపూర్వకంగా మార్చుకుంటున్నాడు. తన మనస్సే ఇంత పని చేస్తున్నది. మనోలయమైతే అంతా స్పష్టంగా గోచరిస్తుంది.

ప్రేమస్వరూపులారా! మీరెంతో పవిత్ర హృదయులు. కాని, కోరికలనే మేఘాలు వచ్చి చేరి మిమ్మల్ని మాయ చేస్తున్నాయి. మేఘములచేత కప్పబడినప్పుడు సూర్య, చంద్రులు మరుగున పడతారు. అదేరీతిగా, కోరికలనే మేఘాలు అడ్డు రావటం చేత మీ నిజతత్త్వాన్ని మీరు దర్శించలేకపోతున్నారు.

బాల్యమందున పలువురితో కూడి
ఆటపాటలయందు ఐక్యుడగును
యవ్వనంబలరిన అలరు విల్తుని పోల్కి
కామినీ లోలుడై క్రాలుచండు
అర్థవయస్సున ఐహికంబున మున్గి
ద్రవ్యమార్జించుట దవిలియుండు
ముదిమి వచ్చినయంత మురహరి తలవక
అది ఇది లేదని అలమటించు
వివిధ దుర్వ్యసనంబులు వీడలేక
భక్తిమార్గంబు వతుక నాశక్తి లేక
కర్మపంకిలమున పడి క్రాలుచుండు
మట్టి కలుపును జన్మంబు మానవుండు.

జీవితంలో ఎన్ని అనుభవించినప్పటికీ అంత్యము వరకు శాంతిని అనభవించలేకపోతున్నాడు మానవుడు. బాల్యము తరువాత యౌవనము, యౌవనము తరువాత వార్ధక్యము వస్తున్నది. వయస్సు మారుతున్నదేగాని మనస్సు మారటం లేదు. మానవుడు సృష్టిని మార్చటానికి ప్రయత్నించే బదులు తన దృష్టిని మార్చుకోవాలి. సృష్టిని మార్చటానికి ఎవరి తరమూ కాదు. అది భగవంతుని సృష్టి. ఈ సృష్టిలో భగవంతుని సంకల్పముచేత ఏదైనా జరుగుతుంది.

మన దేహములో శక్తి ఉన్నంతవరకు ఆటలు, పాటలతో ఆనందాన్ని అనుభవించవచ్చు. అయితే, వాటికికూడా ఒక పరిమితి ఉండాలి. వయస్సు పైడేకొద్దీ పంచభూతాత్మకమైన దేహము అనేక విధములుగా మార్పు చెందుతుంది. మీకు తెలుసు, ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి గొప్పగా గానం చేసేది. కాని, వయస్సు పైబడిన తరువాత తన కంఠము తనకు సహకరించటం లేదని ఆమె బాధపడుతూ వచ్చింది. ఈవిషయాన్ని నాతో ప్రస్తావించగా, 'దేనినికూడా మనం అధికంగా ఉపయోగపెట్టకూడదు. నీ కంఠాన్ని అధికంగా ఉపయోగించి నీవే పడుచేసుకున్నావు' అని చెప్పాను. కంఠముగాని, కంటి దృష్టిగాని అన్నీ కాలక్రమేణా మార్పు చెందేవే. ఈ మార్పు చెందే వాటిని నమ్ముకొని మోసపోవద్దు. మార్పు చెందని ఆత్మతత్త్వాన్ని ఆధారం చేసుకోండి. మానవుడు తనయొక్క దోషములచేతనే తాను కష్టాలకు గురి అవుతున్నాడు. తన ప్రవర్తనను సరిదిద్దుకున్నప్పుడే తాను బాగుపడతాడు. 'నేను మానవుడను. నాకు తిండితీర్థాదులు ప్రధానం కాదు. శీలమే నాకు ప్రధానం' అని భావించాలి. గుణములు సరిలేనప్పుడు మానవుడు ఎన్నో అవస్థలు పడవలసి వస్తుంది.

దివ్యత్వమునకు 'సత్' అని పేరు. 'సత్' అనగా ఎన్నటికీ ఉండేటువంటిది. దివ్యత్వమును ఒక్కొక్క పేరుతో ఆరాధిస్తున్నారు. మహమ్మదీయులు, 'అల్లాహో అక్బర్' అంటారు. అల్లాయే తమకు ఏకైక రక్షకుడని విశ్వసిస్తారు. ముస్లిములకుగాని, హిందువులకుగాని ఎవరికైనా రక్షకుడు భగవంతుడు ఒక్కడే. 'నాకు దైవం కావాలి' అని మీరు హృదయపూర్వకంగా చెప్పాలి. మీరు 'డివైన్'ను కోరుకోవాలి గాని, 'డీప్‌వైన్'ను కాదు. 'రాముడే నా దైవం' అని ఒక్కతూరి విశ్వసించిన తరువాత జీవితమంతా రామనామ స్మరణ కొనసాగించాలి. కాని, ఈనాటి మానవునికి స్థిరమైన భక్తి లేదు. ఆనాడు రాముణ్ణి పూజిస్తాడు. రేపటి దినము యేదైనా కష్టము

వస్తే రాముని ఫోటో తీసివేసి కృష్ణుని ఫోటో పెట్టుకొని పూజిస్తాడు. ఒక భక్తుడు నిత్యం శివపూజ చేసేవాడు. నిరంతరం 'ఓం నమశ్శివాయ' అని పంచాక్షరీ మంత్రాన్ని జపించేవాడు. కొంతకాలమునకు ఆ శివుడు తనకు యేమీ మేలు చేయలేదని భావించి శివుని ఫోటో తీసి బీరువాలో పెట్టేశాడు. రాముని ఫోటో పెట్టుకున్నాడు. రాముని పూజిస్తుంటే కొంతకాలము శాంతిని అనుభవించాడు. కాని, తరువాత అశాంతి ప్రారంభమైంది. రాముని ఫోటోనుకూడా అదే బీరువాలో పెట్టాడు. గురువు దగ్గరకు వెళ్ళి, 'రాముడు నాకేమీ మేలు చేయలేదు, స్వామీ' అన్నాడు. ఆయన సలహానుసరించి కృష్ణుని ఫోటో పెట్టుకున్నాడు. నిరంతరము 'గోపాలకృష్ణా' అంటూ నామజపము చేస్తూ వచ్చాడు. కాని, కొన్ని దినములకు అశాంతి రావటంతో ఆ కృష్ణుని ఫోటోకూడా తీసి బీరువాలో పెట్టేశాడు. ఒకనాడు ఒక దేవీభక్తురాలు వచ్చి, 'అయ్యా! నీవు రాముణ్ణి, కృష్ణున్ని పూజించి ప్రయోజనం ఏమిటి? దేవీపూజ చేయి' అని సలహా యిచ్చింది. అతను దేవీ ఫోటో పెట్టి, ఊదొత్తులు వెలిగించి పూజ ప్రారంభించాడు. ఐతే, ఊదొత్తుల నుండి వస్తున్న పరిమళం బీరువావైపుకు వెళ్ళటం చూశాడు. 'అయ్యో! నేనీ ఊదొత్తులు దేవికోసం వెలిగించానుగాని, బీరువాలోనున్న దేవుళ్ళకోసం కాదే! ఒకరికోసం పెట్టింది ఇంకొకరు అనుభవించటానికి అధికారం లేదు' అనుకొని ఆ ఫోటోలను బీరువానుండి తొలగించాలని నిర్ణయించుకున్నాడు. అప్పుడు దేవి ప్రత్యక్షమై, 'పిచ్చి మానవుడా! ఇదా నీ భక్తి! కొన్ని దినములు రాముని పూజించావు, కొన్ని దినములు కృష్ణుని పూజించావు. ఇంక నన్ను ఎన్ని దినములు పూజిస్తావో! ఏనాడు బీరువాలో పెడతావో! ఇది కాదు నిజమైన భక్తి. తుది శ్వాస వరకు ఒకే దైవముపై మనస్సును నిల్పుకోవాలి. లౌకికమైన జీవితములో వచ్చే కష్టనష్టములకు చలించకుండా ఆధ్యాత్మిక జీవితమును గడపాలి. నీ హృదయములో పవిత్రమైన భావములు అభివృద్ధికావాలి' అని బోధించింది.

నీవు జీవితంలో ఉన్నత స్థితికి రావాలనుకుంటే భగవన్నామాన్ని మరువకుండా, మార్చుకోకుండా స్మరిస్తూ ఉండాలి. ఎలాంటి పరిస్థితిలోనూ నీ మనస్సును మార్చుకోకూడదు. అయతే, మనస్సు కూడా కల్పితమైనదే! 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అన్నారు. బంధనకుగాని, మోక్షమునకుగాని మనస్సే కారణం. కోరికలవలనే మనస్సు చలిస్తూ ఉంటుంది. కోరికలను నిర్మూలించుకున్నప్పుడే నీవు శాంతిని అనుభవించగలవు. కేవలం దానధర్మాలు చేయటం వలన నీవు మంచివాడవు కాలేవు. అనన్యభక్తితో నిన్ను నీవు దైవానికి అర్పితం చేసుకో. అప్పుడే నీకు అన్నివిధాలా శాంతి, సంతోషములు కలుగుతాయి. కోరికలను కంట్రోలు చేసుకో. నీ సంకల్పాలను కంట్రోలు చేసుకో. అప్పుడు జగత్తంతా నీ కంట్రోలులోకి వస్తుంది. సత్యము, ప్రేమ ఈ రెండే శాశ్వతమైనవి. ఇవి నీయందే ఉన్నాయి. 'సత్యానాస్తి పరో ధర్మః' సత్యమును ఆధారము చేసుకొని ధర్మమును ఆచరించినప్పుడే నీలో ప్రేమ ఆవిర్భవిస్తుంది. ప్రేమయే సర్వ కర్మలను ఫలింపచేస్తుంది.

దివ్యాత్మస్వరూపులారా! నశించే దేహము మీరు కాదు. చావు పుట్టుకలు లేని దేహియే మీరు. మీ నిజత్వాన్ని మీరు గుర్తించినప్పుడే అమృతత్వాన్ని పొందుతారు. చింతలనుండి విముక్తులౌతారు. 'చింతలు లేనివారు కోరికలు లేనివారు ఈలోకంలో ఎవరైనా ఉన్నారా?' అని మీరు ప్రశ్నించవచ్చు. దానికి నేనొక్కడినే సరియైన ఆదర్శము. నాకు ఎట్టి వాంఛలూ లేవు. అన్నీ నాచేతిలోనే ఉన్నాయి. మీకు యేది కావాలన్నా నేను యివ్వగలను. అయితే, మార్పుచెందేవాటిని కోరకండి. ప్రాపంచికమైన విషయాలు, వస్తువులు కదలిపోయే మేఘాల వంటివి. శాశ్వతమైన తత్త్వాన్ని కోరుకోండి. ఈ జగత్తంతటికీ సత్యము, ప్రేమ ఈ రెండే ఆధారం.

ఇవి అందరియందు ఉన్నాయి. అందరియందున్న సత్యమునే నేను. అందరియందున్న ప్రేమయే నేను. సత్యము, ప్రేమ ఇవి సర్వత్రా వ్యాపించి ఉన్నాయి. కాని, మీకు సత్యము, ప్రేమ అంటే రుచించదు. మీ అనుకూలమునుబట్టి మీరు సత్యమును, ప్రేమను ఉపయోగపెడుతున్నారు.

ప్రేమస్వరూపులారా! ఈనాడు మీరు గొప్ప అధికారములో ఉండవచ్చు. కాని, ఈ అధికారము ఎంత కాలముంటుంది? దివ్యత్వము ఒక్కటే శాశ్వతమైనది. ఈనాడు యిట్టి సత్యమార్గములో మీరు ప్రవేశించారు. దీనిని మీరు ఏనాడూ విడిచిపెట్టకూడదు. ఈ సత్యాన్ని మీర ఏనాడూ మరువకూడదు. దేనిని మరచినా, సత్యప్రేమలను మరువకూడదు. సత్యము బహిర్వ్యాపిని, ప్రేమ అంతర్వ్యాపిని. ఈరెండిటినీ మనం కాపాడుకుంటూ రావాలి. అదే మానవునియొక్క నిజమైన కర్తవ్యము. ఈరెండూ లేకపోతే వాడు మానవుడే కాడు.

ప్రేమస్వరూపులారా! మీ జీవితాన్ని ప్రేమమయం గావించుకోండి. మీ ప్రేమను కేవలం మీ భార్యాబిడ్డలకు మాత్రమే పరిమితం చేయకండి. విశామైన భావంతో అం దరినీ ప్రేమించండి. అందరూ భగవత్స్వరూపులే! కాబట్టి, సర్వులకు మీ ప్రేమను పంచండి. సత్యమార్గముననుసరించండి. నేను నిరంతరము సత్యప్రేమలనే బోధిస్తుంటాను. అందునిమిత్తమే నేను అనేక సభలను జరుపుతుంటాను. మీరు యిక్కడికి వచ్చి స్వామి సందేశాన్ని విన్నందుకు మీ నిత్యజీవితంలో సత్యప్రేమలను ఆచరణలో పెట్టండి.అప్పుడే నాకు ఆనందము కలుగుతుంది. లౌకికమైన భావాలతో మీ ప్రేమను కలుషితం గావించకండి. ఒక్క దైవత్వముపైననే మీ ప్రేమను ప్రసరింపచేయండి. ఇందుకు రాధయే చక్కని ఆదర్శము. రాధకు ఆధారం ధార ఆరాధన. రాధ అనే పేరును తిప్పి చదివితే 'ధర' అవుతుంది. కనుక, రాధ అనగా ప్రకృతి. కృష్ణుడు పరమాత్మ. ప్రకృతి స్వరూపిణియైన రాధ తన ప్రేమను కేవలం కృష్ణపరమాత్మపైనే ప్రసరింపచేసింది. ఆమెకు యే పూజలు తెలియవు. కృష్ణ చింతన తప్ప ఆమెకు అన్యచింతలు లేవు. కనుక, ఆమె ముక్తిని పొందగలిగింది. మీరు ముక్తిని పొందగోరితే ఈవిధమైన మార్గాన్ని అవలంబించాలి.

ప్రేమస్వరూపులారా! నేను అధికంగా మాట్లాడి మీకు శ్రమ కలిగిస్తున్నానేమో! ఇక యింతటితో నా ప్రసంగాన్ని విరముస్తున్నాను. మీరు చేసే ప్రతి పనిని దైవకార్యంగా భావించండి. సర్వత్రా దైవత్వాన్ని దర్శించండి. మీరు ఇట్టి దైవభావములతో జీవితాన్ని గడిపినప్పుడే నేను ఆనందిస్తాను. ఈనాడు మీరింతమంది ఇక్కడికి వచ్చారు. మీ అందరికీ పవిత్రమైన నా ప్రేమానందములను అందిస్తున్నాను. మీరందరూ 'లాంగ్ లైఫ్', 'హ్యాపీ లైఫ్', 'పీస్‌ఫుల్ లైఫ్' గడపాలని ఆశీర్వదిస్తున్నాను.

(2005 నవంబరు 23వ తేదీ ఉదయం శ్రీసత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో భగవాన్ బాబావారి జన్మదిన సందేశము)